## కన్నతల్లిని వీధిపాలు చేసిన కుమారులు

## డైనమిక్ కథనానికి స్పందించిన అధికారులు





**డైనమిక్ న్యూస్– మోతే** మోతే మండలం నామవరం గ్రామంలో వృద్ధురాలిపై జరిగిన నిర్లక్ష్య ఘటన స్థానికంగా కలకలం రేపింది. 95 ఏళ్ల నల్లగంతుల వెంకటమ్మ అనే వృద్ధురాలు, తన ముగ్గురు కుమారుల నిర్లక్ష్యంతో వీధిపాలైన పరిస్థితి ఎదుర్కొంటోంది.గ్రామస్థుల వివరాల ప్రకారం, 2021లో తల్లిని చూసుకుంటామని హామీ ఇచ్చిన కుమారులు, మూడు ఎకరాల తొమ్మిది గుంటల భూమిని తమ మధ్య పంచుకున్నారు. అయితే ఆస్తి పంచుకున్న తర్వాత తల్లిని పూర్తిగా విస్మరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.వృద్ధురాలి పరిస్థితిని గమనించిన గ్రామస్థులు 2024లో ఆర్డీఓను ఆశ్రయించగా, ముగ్గురు కుమారులు నెలకు రూ.1500 చొప్పున భరణం చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ఈ ఆదేశాలు అమలు కాలేదు. 18-01-2025 నుండి ఇప్పటి వరకు చెల్లించాల్సిన మొత్తం కూడా ఇవ్వలేదని సమాచారం.ఈ విషయంపై డైనమిక్ న్యూస్ ప్రచురించిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. ఎమ్మార్వో వెంకన్న, మోతే సబ్ ఇన్స్పెక్టర్ టి. అజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.ఎమ్మార్వో కుమారులను బైండ్ ఓవర్ చేసి, పెండింగ్‌లో ఉన్న భరణం మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశించారు. అలాగే వృద్ధురాలి వైద్య ఖర్చులు కూడా కుమారులే భరించాలని స్పష్టం చేశారు.మార్చి 23న జరిగిన ప్రమాదంలో వెంకటమ్మ కాలికి గాయం కావడంతో, ఆమెను సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమెకు కుమార్తెలే చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.ఈ ఘటనపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డైనమిక్ న్యూస్ కథనంతో అధికారులు స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భీమ్ దీక్ష ఆరోగ్య జాతరను విజయవంతం చేయాలి

స్వేరో నెట్వర్క్ జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి పిలుపు




**డైనమిక్ న్యూస్–సూర్యాపేట** సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్వేరో నెట్వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భీమ్ దీక్ష ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి కోరారు.శనివారం విలేకరులతో మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య జాతర ద్వారా ప్రజల్లో ఆరోగ్యం, విద్య, ఆర్థిక చైతన్యం పెంపొందించడమే ఉద్దేశమని చెప్పారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (రిటైర్డ్ ఐపీఎస్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అలాగే స్వేరో నెట్వర్క్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

## అత్యాధునిక వసతులతో ఫంక్షన్ హాల్ ప్రారంభం



**డైనమిక్ న్యూస్ –సూర్యాపేట** పట్టణంలోని 11వ వార్డు పిల్లలమర్రి స్టేజి సమీపంలో రుద్రంగి ఏసీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో అత్యాధునిక వసతులతో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత తదితరులు పాల్గొన్నారు.నిర్వాహకులు రుద్రంగి సురేష్ మంజుల మాట్లాడుతూ పార్కింగ్, లైటింగ్, ఇతర సౌకర్యాలతో హాల్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పంచాయతీ నిధుల గోల్‌మాల్ ఆరోపణలు --

## కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

**డైనమిక్ న్యూస్ – టేక్మాల్** టేక్మాల్ మండలం తంపులూర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ గ్రామస్తులు మెదక్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో సుమారు రూ. 9.25 లక్షలు అక్రమంగా ఖర్చు చేసినట్లు వారు ఆరోపించారు.గ్రామ సభలో ఖర్చుల వివరాలు కోరగా పంచాయతీ కార్యదర్శి స్పష్టత ఇవ్వకపోవడంతో అనుమానాలు మరింత పెరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు.అదే సమయంలో గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, నెలలుగా శుభ్రత పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఫిర్యాదును స్వీకరించిన జిల్లా అధికారులు ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

## నూతన తైబజారు ప్రారంభం



**డైనమిక్ న్యూస్ – టేక్మాల్** గ్రామ ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన తైబజారును గ్రామ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం రిబ్బన్ కత్తిరించి బజారును ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా ఈ బజారును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక వ్యాపారులకు మెరుగైన వసతులు కల్పించడం, ప్రజలకు నాణ్యమైన వస్తువులు అందుబాటులో ఉంచడం లక్ష్యమన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ విద్యాసాగర్, మాజీ కోపరేటివ్ డైరెక్టర్ ఆకులపల్లి పాపయ్య, వార్డు సభ్యులు సదాశివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఈస్టర్ సందర్భంగా చర్చిల వద్ద వీధి దీపాల ఏర్పాటు



**డైనమిక్ న్యూస్ – హుజూర్ నగర్** 19వ వార్డులో ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చిల వద్ద కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ సహకారంతో, కౌన్సిలర్ వల్లపు దాసు కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వార్డులో మౌలిక వసతుల మెరుగుదలకు భాగంగా నిరుపయోగంగా ఉన్న రెండు బోర్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ పైపులైన్ పనులు కూడా త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ సైదా, షేక్ నాగుల్ మీరా, షేక్ మీరా పాషా, వల్లపు దాసు రమేష్, కాసాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ



**నేరేడుచెర్ల – డైనమిక్ న్యూస్** నేరేడుచెర్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ బి. మధు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.అలాగే ఉపాధ్యాయులు అన్నపూర్ణ, అనసూర్య, విజయ, భూదెమ్మ తదితరులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్‌గా ఏ. హన్విక, డీఈఓగా ఏ. కోమలి, ఎంఈఓగా ఈ. లౌక్యశ్రీ, హెచ్‌ఎంగా ఎం.డి. జెషాన్, పీఈటీగా ఎం. బలరాం, జి. రాకేష్ బాధ్యతలు స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## వరకట్నంపై అవగాహన కార్యక్రమం




**సూర్యాపేట బ్యూరో – డైనమిక్ న్యూస్** సూర్యాపేట జిల్లా చివ్వెముల గ్రామంలో జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత వరకట్నం, 498-ఎ, 304-బి కేసులపై ప్రజలకు చట్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు నేరమని, ఆడ--మగ సమానత్వం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ భూములకు త్వరలో డి-ఫామ్ పట్టాలు: ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి



**నల్గొండ బ్యూరో – డైనమిక్ న్యూస్** నియోజకవర్గంలోని తిరుమలగిరి సాగర్ మండలంలో పెండింగ్‌లో ఉన్న ఫారెస్ట్ భూములకు త్వరితగతిన డి-ఫామ్ పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి కోరారు. శనివారం నాగార్జునసాగర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు.గత 30 సంవత్సరాలుగా అటవీ భూములు సాగు చేస్తున్న పేద రైతులకు హక్కులు కల్పించాలని, అసైన్మెంట్ భూముల పంపిణీ వేగవంతం చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఫారెస్ట్ భూములపై డి-ఫామ్ పట్టాల ప్రక్రియ కొనసాగుతోందని, వెరిఫికేషన్ పూర్తయ్యిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే సుమారు 12,000 ఎకరాల భూమి సర్వే పూర్తయిందని చెప్పారు. గ్రామ స్థాయిలో సర్వేలు, గ్రామ సభల ద్వారా ధృవీకరణ కొనసాగుతోందన్నారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులపై ఎస్పీ సమీక్ష




**డైనమిక్ న్యూస్ – సూర్యాపేట బ్యూరో** పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి కోర్టులతో సమన్వయంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో సమన్లు, వారెంట్లు సకాలంలో అమలు చేసి నిందితులు, సాక్షులను కోర్టుకు హాజరు పరచాలని సూచించారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని తెలిపారు.

## ప్రజల వద్దకే పాలన.. హుజూర్‌నగర్‌లో పనులు వేగం



**హుజూర్‌నగర్– డైనమిక్ న్యూస్** మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో 28 వార్డుల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు.14వ వార్డులో 20 కరెంట్ స్తంభాలు, 9 మిడిల్ పోల్స్, 5 సపోర్ట్ పోల్స్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. సమస్యలను గుర్తించిన వెంటనే అధికారులు స్పందించడంతో ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## శాల్మలికంద గోదాదేవి సన్నిధిలో వైభవంగా నవకలశ స్నాపన, సుదర్శన హోమం



**డైనమిక్ న్యూస్–హుజూర్‌నగర్** బూరుగడ్డలోని శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో శాల్మలికంద గోదాదేవి సన్నిధిలో నవకలశ స్నాపన, అభిషేకం, అర్చన, సుదర్శన హోమం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తీర్థప్రసాద గోష్టి, బాలభోగం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.సాయంత్రం శ్రీ వేణుగోపాలస్వామి రుక్మిణి, సత్యభామ, గోదాదేవి సమేతంగా గజవాహనంపై ఊరేగింపుగా బూరుగడ్డ--మాచవరం గ్రామాల్లో రథసేవ జరిగింది. అనంతరం నిత్యహోమం, బలిహరణం, మంగళశాసనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు, ఆలయ అధికారులు, ధర్మకర్తలు, తహసీల్దార్ బండ కవిత రెడ్డి దంపతులు సహా స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాగునీటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్న మాసాయిపేట్ సర్పంచ్



**డైనమిక్ న్యూస్ మాసాయిపేట్** మాసాయిపేట మండల కేంద్రంలో తీవ్రమైన తాగునీటి సమస్యను పరిష్కారం దిశగా ఈరోజు ఒకటవ రెండవ మూడవ వార్డులు తిరిగి ఇక్కడ వాటర్ వృధాగా పోతుందో వాటిని డమ్మీ చేయించి రాని వారికి కట్టువాల్సి ఏర్పాటు చేయడం ఉదయం సమయం ఒక వైపు సాయంత్రం సమయంలో మరో వైపు వచ్చేలా కట్టువల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇలా చేయడం వల్ల వేసవిలో అందరికీ నీరు అందుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి ఉప సర్పంచ్ పసుల వెంకటేశం పీఎసిఎస్ డైరెక్టర్ ఊదండపురం నరసింహులు వార్డ్ మెంబర్స్ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు

## అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారి



**డైనమిక్ న్యూస్ మోతే ఏప్రిల్ 3** మోతే మండలం రాఘవపురం ఎక్స్ రోడ్ పరిధిలోని నామవరం-సిరికొండ ప్రధాన రహదారిపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై గ్రామపంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు నోటీసులు అందుకున్న వెంటనే సంబంధిత వ్యక్తులు తమ అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు లేని పక్షంలో పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సంబంధిత రహదారి మొత్తం వెడల్పు 50 అడుగులు ఉండగా ప్రస్తుతం చిన్న వ్యాపారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా రోడ్డుకి ఇరువైపులా 18 అడుగుల వరకు మాత్రమే అక్రమ నిర్మాణాన్ని తొలగించనున్నట్లు తెలిపారు భవిష్యత్తులో దశలవారీగా పూర్తిస్థాయిలో అన్ని అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు అదేవిధంగా రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి ఇండ్లను తక్షణమే గ్రామ పంచాయతీ రికార్డు నుండి తొలగించే చర్యలు ప్రారంభించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు

## ఓటర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలి సీఈఓ సుదర్శన్ రెడ్డి




**సూర్యాపేట బ్యూరో – డైనమిక్ న్యూస్** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేయడం, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం చేపట్టడం, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. సీతారామారావు మాట్లాడుతూ జిల్లాలో సిబ్బందికి శిక్షణ పూర్తయిందని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు.

